క్లుప్తంగా

విద్యార్థులు సేవా గుణం అలవర్చుకోవాలి



అన్నవరపులంక(కొల్లిపర): విద్యార్థి దశ నుంచే సేవా గుణం అలవర్చుకోవాలని అప్పుడే మేలైన సమాజం ఏర్పడుతుందని సర్పంచి తోడేటి రాజేశ్వరి అన్నారు. సోమవారం మండల పరిధిలో అన్నవరపు లంక గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల్లో సుజన సేవా సమితి ఆర్థిక సహకారంతో భారత్ స్కాట్ అండ్ గైడ్స్ టీం వివిధ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు స్కాట్ యూనిఫాం, ఇతర సామగ్రి అందజేశారు. అనంతరం 16 మంది విద్యార్థులకు స్కాట్ యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో మరకనపల్లి రవిబాబు, ప్రధానోపాధ్యాయడు మల్లేశ్వర్, స్కాట్ ఉపాధ్యాయులు ఘంటా కిరణ్, కె.హనుమంత రావు పాల్గొన్నారు.

జేఎంజే స్వధార్‌లో సామగ్రి పంపిణీ



తెనాలి: పట్టణంలోని తెనాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జేఎంజే స్వధార్‌లో మానసిక వికలాంగులు, అనాథలు యాభైమందికి వ్యక్తిగత సంరక్షణ వస్తువులను అందజేశారు. టూత్‌బ్రష్, టూత్‌పేస్ట్, ట్యాంక్ క్లీనర్, సబ్బు, స్కాల్ప్ ఆయిల్, కోల్డ్ క్రీమ్, బిస్కట్ ప్యాకెట్ వంటివి ఇందులో ఉన్నాయి. నారపు వైష్ణవి జన్మ దినాన్ని స్వధార్‌లోని ఆశ్రితులతో ఇలా సేవా కార్యక్రమంలో జరుపుకొన్నారు. జేఎంజే స్వధార్ యాజమాన్యం సిస్టర్ హృదయమేరీ, నారపురెడ్డి, కార్తీక్, అభివృద్ధి సొసైటీ సభ్యులు సునీల్, అచ్యుత సాంబశివరావు, రాజేంద్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిరోజు మురుగు కాలువలు శుభ్రం చేయాలి



తెనాలిఅర్బన్: పట్టణంలోని మురుగు కాలువలను ప్రతిరోజు బాగు చేయించే విధంగా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 33,,34,35,37 వార్డులలో సోమవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాలువల నిర్వహణపై తరచు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. అవి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు.

సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు

తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సమావేశంలో మొత్తం ఐదు అర్జీలు వచ్చాయి. తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ క్యాంపునకు వెళ్లటంతో తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ వివిధ ప్రాంతాల్నుంచి వచ్చిన అర్జీదారుల్నుంచి అర్జీలు స్వీకరించారు. డివిజనల్ పంచాయతీ అధికారి పరిధిలో ఒకటి, మున్సిపాలిటీకి సంబంధించి రెండు అర్జీలు, పోలీస్, ఎంపీడీఓ కార్యాలయం పరిధిలో ఒకటి చొప్పున అర్జీలు వచ్చాయి. సంబంధిత అధికారులకు పంపి, నిర్ణీత వ్యవధిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ వెల్లడించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ జి.సుధాకిరణ్మయి పాల్గొన్నారు.

జమిలీ ఎన్నికలు పెట్టుబడిదారులకు మేలు

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు

లక్ష్మీపురం: పెట్టుబడిదారులకు మేలు చేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జమిలీ ఎన్నికల నినాదాన్ని తెరపైకి తెచ్చారని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు విమర్శించారు. స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వి.ఐ లెనిన్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సమకాలిన రాజకీయ పరిణామాలపై నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. సభకు సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అధ్యక్షత వహించారు. రాఘవులు ప్రసంగిస్తూ దేశంలో అన్ని రకాల ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు హేతుబద్ధతలేని సాకులను మోడీ ప్రభుత్వం చెబుతుందన్నారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్. బాబూరావు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నేతాజి, ఈమని అప్పారావు, ఎన్.భావన్నారాయణ, కె.నళినీకాంత్, ఎమ్.రవి, ఎస్.ఎస్.చెంగయ్య పాల్గొన్నారు.

కూటమిలో

శిలాఫలకం పంచాయితీ

• 'ఆలపాటి' పేరు లేదంటూ 'తమ్ముళ్ల' ఆగ్రహం • శిలాఫలకం మార్చాలని హెచ్చరిక



కొలకలూరులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి మనోహర్(ఫైల్)

తెనాలి: కూటమిలో ఇప్పుడు శిలాఫలకం పంచాయితీ నడుస్తోంది. అభివృద్ధి పనుల శంకుస్థాపన శిలాఫలకంలో మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేరు లేకపోవటంతో ఆ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా తెనాలి ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. శిలాఫలకం మార్చాలని, లేకుంటే తామే మారుస్తామని హెచ్చరిస్తున్నారు. ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో చేపట్టే పనుల శంకుస్థాపన కార్యక్రమాలను పల్లెపండుగ వారోత్సవాలుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న విషయం తెలిసిందే. కొల్లిపర మండలంలో శంకుస్థాపనల అనంతరం గత ఆదివారం తెనాలి రూరల్ మండలంలో ఈ శంకుస్థాపన జరిపారు. తెనాలి ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పలు గ్రామాల్లో ఆయా నిర్దేశించిన పనులకు శంకుస్థాపన చేశారు. సంబంధిత శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఆయా శిలాఫలకాల్లో మాజీ మంత్రి, తెనాలికి చెందిన టీడీపీ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేరును చేర్చకపోవటం తెలుగు తమ్ముళ్ల ఆగ్రహానికి గురిచేసింది.

➡ రూరల్ మండలం కొలకలూరులో శిలాఫలకాన్ని ఉద్దేశించి టీడీపీ నేతలు సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అందులో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, జిల్లాకు చెందిన మంత్రి మనోహర్‌తో పాటు మరో మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు ఎమ్మెల్సీలు, గ్రామ సర్పంచ్, జెడ్పీటీసీ సహా పేర్లు శిలాఫలకంలో చేర్చారు. వీటితో పాటు ఆలపాటి రాజా పేరు ఎందుకు చేర్చలేదనేది టీడీపీ నేతల ప్రశ్న!

➡ ఎన్నికలకు ముందు సీట్ల పంపకంలో తెనాలి సీటును జనసేన పార్టీకి చెందిన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌కు కేటాయించారు. అప్పటికే తెనాలి మాజీ ఎమ్మెల్యేగా ఆలపాటి రాజా ఇక్కడ నుంచి పోటీకి రంగం సిద్ధం చేసుకున్నారు. కూటమి పొత్తులో భాగంగా పార్టీ అధిష్టానం ఆదేశంపై రాజా తెనాలి సీటును వదులుకున్నారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థి మనోహర్ గెలుపునకు కృషి చేశారు. అలాంటప్పుడు ఎన్నికలై, మంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత తమ నాయకుడు రాజాను విస్మరించారనేది తెలుగు తమ్ముళ్ల వాదన.

➡ క్విట్‌ఇండియా ఉద్యమ అమరవీరుల దినోత్సవాన్ని తెనాలి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏటా ఆగస్టు 12న వీరసంస్మరణ దినోత్సవంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఆగస్టు 12వ తేదీన నిర్వహించిన ఈ వేడుకల ఆహ్వాన పత్రికలో ఆలపాటి రాజా పేరును చేర్చలేదు. దీనితో ఆలపాటి రాజా తన కార్యకర్తలతో కలసి రణరంగచౌక్‌లోని అమరవీరుల స్థూపాలను పుష్పాంజలి సమర్పించి, తిరిగి వెళ్లిపోయారు. అక్కడే జరిగిన బహిరంగ సభలో పాల్గొనలేదు. నిజానికి రణరంగచౌక్‌ను ముస్తాబు చేసి, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వీర సంస్మరణ దినంగా అధికారికంగా భారీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసింది రాజా ఎమ్మెల్యేగా ఉన్న కాలంలోనే. ఆహ్వాన పత్రికలో పేరు లేకపోగా, కనీసం సంబంధిత ఫ్లెక్సీల్లోనూ రాజా ఫొటో, పేరును చేర్చకపోవటాన్ని అప్పట్లో ప్రశ్నించారు.

➡ మళ్లీ ఇప్పుడు పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనుల శంకుస్థాపనలోనూ తమ నాయకుడిపై ఇదే తరహా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంచారనేది రాజా అనుయాయుల వాదన. కూటమి పొత్తు ధర్మం కోసం తన సీటునే త్యాగం చేసిన సీనియర్ నాయకుడిపై ఈ వైఖరిని ప్రదర్శించటం ఎలా సమంజసమని ప్రశ్నించారు. దీనిపై నేరుగా మంత్రిని ప్రస్తావిస్తూ ఒకరు సోషల్ మీడియాలో పోస్టులు పెడితే మరొకరు ఏకంగా శిలాఫలకాన్నే మార్చాల్సిందేనంటూ హెచ్చరించారు. లేకుంటే కొలకలూరు గ్రామ టీడీపీ తరపున తామే మారుస్తామనీ, తర్వాత ఏదైనా జరిగితే మీదే బాధ్యత అంటూ పోస్టులు పెట్టారు. ఇవన్నీ కూటమి పార్టీ వర్గాల్లోనూ, పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారాయి.



సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్‌స్థాయి సమావేశంలో వివిధ శాఖల అధికారులు

బాణసంచా దుకాణాలకు సింగిల్‌విండో అనుమతులు

- ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలి
- తప్పనిసరిగా జీఎస్టీ చెల్లించాల్సిందే
- డివిజన్ స్థాయి సమావేశంలో అధికారులు

తెనాలి: దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాలకు సంబంధించిన డివిజన్ స్థాయి సమావేశాన్ని సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ ఆదేశాల మేరకు తెనాలి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సమావేశానికి అధ్యక్షత వహించారు. డివిజను నుంచి మున్సిపల్, రెవెన్యూ, అగ్నిమాపకశాఖ, పోలీస్ అధికారులు హాజరయ్యారు. బాణసంచా విక్రయ దుకాణాల కోసం హోల్‌సేల్/రిటైల్ వ్యాపారులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో మూడు శాఖల సిబ్బంది, దరఖాస్తులను పరిశీలించి, అనుమతులను ఇస్తారని తెలిపారు. హోల్‌సేల్ వ్యాపారులు వీధుల్లో విక్రయించే నిమిత్తం తోపుడుబండ్ల వ్యాపారులకు బాణసంచాను కేటాయించవద్దని, అనవసర ప్రమాదాలకు ఆస్కారం ఇవ్వొద్దని కోరారు. విక్రయ దుకాణాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలను నియమించరాదని చెప్పారు. బాణసంచా వ్యాపారులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెనాలి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న చెప్పారు. సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ, బాణసంచా దుకాణాలు ఎల్ ఆకారంలో ఏర్పాటుచేయాలనీ, ఒక్కో దుకాణానికి మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలని చెప్పారు. ప్రతి దుకాణంలోనూ ఇసుక బకెట్లు, నీటి వసతిని అందుబాటులో ఉంచుకోవటం తప్పనిసరిగా వివరించారు. విక్రయదారులు కచ్చితంగా జీఎస్టీ చెల్లించాలని, అప్పుడే వారికి లైసెన్సులు ఇవ్వాలని జీఎస్టీ అధికారి సుధాకర్ చెప్పారు. తెనాలిలో బాణ సంచా దుకాణాల ఏర్పాటుకోసం టీజే కాలేజి, వీఎస్సార్ కాలేజి గ్రౌండ్స్‌లో వర్షంనీరు నిలిచినందున ప్రత్యామ్నాయ స్థలాన్ని చూస్తామని అధికారులు వెల్లడించారు. బాణసంచా వ్యాపారులతో మంగళవారం సమావేశం జరిపి అవగాహన కల్పించాలని నిర్ణయించారు. తెనాలి ట్రైనీ డీఎస్పీ ఎన్.భార్గవి మరివాడ, పొన్నూరు మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు, మంగళగిరి, తెనాలి సీఐలు డి.వినోద్‌కుమార్, వి.మల్లికార్జునరావు, కె.వేదాంతరావు, దుగ్గిరాల తహసీల్దార్ సునీత, సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ జి.సుధాకిరణ్మయి పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

డీఎస్పీ జనార్ధనరావు



పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు, ఇతర పోలీసు అధికారులు

తెనాలిరూరల్: అమరవీరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేయాలని డీఎస్పీ బి.జనార్ధనరావు సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా స్థానిక చెంచుపేటలోని దివంగత ఐపీఎస్ అధికారి ఉమేష్‌చంద్ర విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అశువులు బాసిన వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి, వారిలో అభిమానాన్ని సంపాదించుకున్న అధికారులు, తోటి సిబ్బంది స్ఫూర్తితో విధులు నిర్వహించాలన్నారు. శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసులకు ప్రజలందరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ట్రైనీ డీఎస్పీ భార్గవి, సీఐలు ఎస్.రమేష్ బాబు, వి. మల్లికార్జునరావు ఆర్టీసీ డీఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో..

తెనాలి రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ పోలీస్‌స్టేషన్ వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. జీఆర్పీ ఎస్ఐ జి.వెంకటాద్రి, స్టేషన్ మేనేజర్ టీవీ రమణ, ఆర్పీఎఫ్ సిబ్బంది, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

మణికంఠ సేవా సమితికి అరుదైన గౌరవం



అవార్డు అందుకుంటున్న కొల్లిపరకు చెందిన శంకర్‌రెడ్డి, రఘునాథరెడ్డి

కొల్లిపర: మహా శాస్త సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమంలో ముందుండి నడిపిస్తున్న గురుస్వాములకు, స్వచ్ఛంద సేవా సంస్థకు హైదరాబాద్‌లోని మణికంఠ ఫంక్షన్ హాల్‌లో కేరళ తాంత్రీలు విష్ణు నారాయణ పొత్తి, శివనరసింహన్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నట్లు శ్రీమణికఠ సేవా సమితి కమిటీ సభ్యుడు బొంతు వెంకటరెడ్డి(దత్తు స్వామి) తెలిపారు. కొల్లిపరలోని శ్రీ గంగా పార్వతి సమేత ముకెత్తేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో సేవా సమితి సభ్యుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తు స్వామి మాట్లాడుతూ పదేళ్లగా కొల్లిపర మండలంలో శ్రీమణికఠ సేవా సమితి అయ్యప్ప భక్తులకు, మాల ధరించిన స్వాములకు అన్నదానంతో పాటు అనేక సేవా కార్యక్రమాలతో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రతి సంవత్సరం డిసెంబర్ 03 నుంచి జనవరి 13వ తేదీ వరకు అన్నదానం నిర్వహించాలని సభ్యులు అందరూ కలసి తీర్మానించారు. ఉత్తమ సేవా పురస్కారంతో పాటు కొల్లిపర మండల గురుస్వామి జంగా శంకరరెడ్డికి గురు పురస్కారం కూడా రావటం మరొక విశేషం అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఆరిమండ శివరామకృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కొల్లి అంజిరెడ్డి, సెక్రటరీ కొల్లి రఘునాథరెడ్డి, సభ్యులు భీమవరపు రాజశేఖరరెడ్డి, భీమవరపు శివరామిరెడ్డి పాల్గొన్నారు.

పట్టణ ప్రముఖుడు ఉయ్యూరు రాజేంద్రప్రసాద్ మృతి

కారు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖుడు ఉయ్యూరు రాజేంద్రప్రసాద్(92) మృతి చెందారు. కొంతకాలంగా ఆయన హైదరాబాద్‌లో ఉంటూ, అప్పుడప్పుడు తెనాలి వచ్చి వెళుతున్నారు. కొద్దిరోజుల క్రితం తెనాలి వచ్చిన రాజేంద్రప్రసాద్ ఆదివారం తిరిగి హైదరాబాద్ వెళుతుండగా, వారు ప్రయాణిస్తున్న కారు మార్గమధ్యంలో నందిగామ వద్ద ప్రమాదానికి గురైంది. దీనితో గాయపడిన రాజేంద్రప్రసాద్‌ను విజయవాడ తీసుకువచ్చి కార్పొరేట్ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స చేసినా, ప్రయోజనం లేకుండా పోయింది. సోమవారం ఉదయం ఆయన కన్నుమూశారు. ఆయన భౌతికకాయాన్ని మంగళవారం సాయంత్రం తెనాలికి తరలిస్తారు. బుధవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తెనాలికి చెందిన రాజేంద్రప్రసాద్ కొత్తపేటలో గతంలో ఎంతో వైభవంగా నడిచిన శ్రీవెంకటేశ్వర థియేటర్ యజమాని. తర్వాతకాలంలో ఆ థియేటర్‌ను ఫంక్షన్ హాలుగా మార్చారు. ప్రస్తుతం అక్కడ అపార్టుమెంటు వెలిసింది. పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్. అదే విధంగా మహాప్రస్థాన సేవాసమితికి వ్యవస్థాపక అధ్యక్షుడిగా చేసి, ప్రస్తుతం గౌరవాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. పట్టణంలో బజాజ్ చేతక్ స్కూటర్‌ను తొలిగా కొనుగోలు చేసింది రాజేంద్రప్రసాదేనని చెబుతారు. ఆయన భార్య గతంలోనే మృతి చెందారు. వీరికి నలుగురు కుమార్తెలు, కుమారుడు, మనుమ సంతానం ఉన్నారు. ఇటీవల సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశానికి కూడా హాజరయ్యారు.

మున్సిపల్ ఏఈ బాధ్యతల స్వీకారం

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ ఏఈగా బి.సునీల్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గుంటూరు కార్పొరేషన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. తెనాలిలో ఏఈగా పనిచేస్తున్న దీప్యా బదిలీపై గుంటూరు వెళ్లారు. ఆమె స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఆదర్శ రైతు రామకృష్ణకు రైతునేస్తం అవార్డు



మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుచే అవార్డు స్వీకరించిన రామకృష్ణ

తెనాలి: తన సమీకృత ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో బియ్యం, రకరకాల కూరగాయలు, పండ్లు సాగుచేస్తూ అక్కడి చెరువులో చేపలను కూడా పెంచుతున్న ఆదర్శ రైతు మీసాల రామకృష్ణకు రైతు నేస్తం అవార్డు లభించింది. గన్నవరం మండలం ఆత్కూరులో స్వర్ణభారతి ట్రస్ట్‌లో ఆదివారం రైతు నేస్తం అవార్డుల ప్రదానం కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చేతులమీదుగా అందుకున్నారు. రామకృష్ణ స్వస్థలం తెనాలి రూరల్ మండల గ్రామం నందివెలుగు. గ్రామం వెలుపల నిజాంపట్నం కాలువ పక్కనే ఉన్న 13 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో కొన్నేళ్లుగా సమీకృత ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. అరెకరంలో చేపల చెరువు. ఆరు ఎకరాల మాగాణిలో బీపీటీ-5204 సహా, వివిధ దేశావాళీ వరి రకాలను సాగుచేస్తున్నారు. మెట్ట భూమిలో అరటి, చక్కెరకేళి, కూరఅరటి, ఐదెకరాల్లో బీర, బెండ, పొట్లకాయ, కాకరకాయ, కీరదోస, దోస, సొరకాయ, గోరుచిక్కుడు, తోటకూర, గోంగూర, మునగ, కరివేపాకు, పాలకూర, మిగిలిన విస్తీర్ణంలో కొబ్బరి, మామిడి, జామ, నిమ్మ, నారింజ చెట్లు ఉన్నాయి. ఒక కుటుంబానికి రోజువారీ కావాల్సిన బియ్యం, కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు అన్నీ అక్కడే దొరుకుతున్నాయి. పొలం గట్టునే ఆహారోత్పత్తుల మార్కెట్‌గా చేసుకుని, తోట దగ్గరే వాటని విక్రయిస్తూ, ప్రతిరోజూ ఆదాయాన్ని పొందుతున్నారు రామకృష్ణ. వీరి వ్యవసాయ క్షేత్రాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు సందర్శించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘంలో చేరి, సంఘం ఆధ్వర్యంలో సమీపంలోనే ఆర్గానిక్ సరుకులతో సూపర్‌మార్కెట్‌నూ నడుపుతున్నారు. ఆ క్రమంలోనే రైతునేస్తం అవార్డు వరించింది.

విద్యార్థుల్లో నాలెడ్జ్, స్కిల్స్ పెంపొందాలి

ప్రొఫెసర్ మైత్రేయీ దత్త



చేబ్రోలు: విద్యార్థుల్లో నాలెడ్జ్‌తో పాటు స్కిల్స్‌ను పెంపొందించాలని చండీఘర్‌లోని ఎన్ఐటీటీటీఆర్(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్ ట్రె నింగ్ అండ్ రీసెర్చ్) ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఎమర్జింగ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ మైత్రేయీ దత్త అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్(ఓబీఈ) అండ్ అక్రిడిటేషన్' అనే అంశంపై 5 రోజుల పాటు నిర్వహించనున్న ట్రెనింగ్ ప్రోగ్రాంను సోమవారం వైస్ చాన్సలర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మైత్రేయీ దత్త మాట్లాడుతూ విద్యార్థుల సాంకేతిక, సామాజిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, వాటిని ఉపయోగించి వారు భవిష్యత్‌లో ఎలా నిలదొక్కుకుంటారనే అంశాలను బట్టి వారి విద్యా ప్రయాణం ఉంటుందనేదే ఓబీఈ విధానంలోని ప్రత్యేకతని తెలియజేశారు. ఈ విధానంలో విద్యార్థులు చదువుతున్న సబ్జెక్టు ఫలితాలు ముందే నిర్దేశించబడతాయన్నారు. వాటి ఆధారంగా విద్యా కార్యక్రమాలు, బోధన పద్ధతులు రూపకల్పన చేస్తామన్నారు. విద్యార్థులు సబ్జెక్టులను మాత్రమే నేర్చుకోకుండా వారి నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించడానికి ఓబీఈ తోడ్పడుతుందన్నారు. విద్యార్థుల ఆలోచనా పద్ధతులు, పరిష్కార నైపుణ్యాలను పొందేందుకు ఇది సహాయపడుతుందని తెలియజేశారు. మార్కెట్ అవసరాలకనుగుణంగా విద్యా విధానం ఉండేలా విద్యార్థులను సిద్ధం చేస్తుందన్నారు. నైపుణ్యాలను ప్రాధాన్యతగా తీసుకోవడం ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని వెల్లడించారు. విద్యార్థులు కేవలం సబ్జెక్టులను మాత్రమే కాకుండా వ్యావహారిక పరిజ్ఞానం పొందడం వలన సమగ్ర అభ్యాసం పొందుతారని తెలిపారు. విద్యార్థులు లక్ష్యాలను ఎలా సాధిస్తున్నారు అనేది పరిశీలించి, వారి పనితీరును జాగ్రత్తగా మూల్యాంకనం చేస్తామన్నారు. విద్యార్థుల వ్యక్తిగత, వత్తి అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించే ప్రాక్టికల్ పనితీరు, అనుభవం ఆధారంగా ర్యాంకులు కాకుండా ఫలితాల ఆధారంగా గుర్తింపు వస్తుందన్నారు. విద్యా సంస్థల ప్రదర్శన ప్రమాణాలను, వారి చదువు ప్రణాళికలను విశ్లేషించి అక్రిడిటేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏఐసీటీఈ, ఎన్‌బీఏ వంటి గుర్తింపు సంస్థలు ఓబీఈ పద్ధతులను పాటించే సంస్థలకు గుర్తింపు ఇస్తాయన్నారు. అక్రిడిటేషన్ అనేది విద్యాసంస్థలు, ముఖ్యంగా ఇంజనీరింగ్, టెక్నాలజీ రంగాల్లో, నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నాయా లేదా అని జాగ్రత్తగా పరిశీలించి గుర్తింపు ఇవ్వడం జరుగుతుందన్నారు. దీని ద్వారా విద్యాసంస్థల్లో నాణ్యత, శాస్త్రీయత, పారదర్శకత ఉంచబడతాయని, ఓబీఈ విధానం మీద ఆధారపడి ఉండే అక్రిడిటేషన్, విద్యార్థుల ప్రతిభను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అక్రిడిటేషన్ ఉండటం వల్ల విద్యాసంస్థలు అంతర్జాతీయంగా గుర్తింపు పొందడంతో పాటు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పీఎంవీ రావు పాల్గొన్నారు.

రేపు ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ

తెనాలి: తుదిశ్వాస వరకు పీడిత ప్రజలు, ఆదివాసుల హక్కుల కోసం ఉద్యమించిన ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభను 23వ తేదీన తెనాలిలో నిర్వహించనున్నారు. ప్రజాసంఘాల ఐక్య వేదిక, భారత్ బచావో, భిన్నస్వరాలు సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఆ రోజు సాయంత్రం 5.30 గంటలకు ఏర్పాటయే సభకు 'అరసం' కార్యదర్శి కనపర్తి బెన్‌హర్ అధ్యక్షత వహిస్తారు. భారత్ బచావో రాష్ట్ర చైర్మన్ చిగురుపాటి భాస్కరరావు, నిర్బంధ వ్యతిరేక వేదిక బాధ్యుడు కె.రవిచంద్ర, 'విరసం' కార్యదర్శి అరసవిల్లి కృష్ణ, సీపీఐ నాయకుడు చెరుకుమల్లి సింగారావు, సీపీఎం నేత కొల్లిపర బాబూప్రసాద్, సీపీఐఎంఎల్(లిబరేషన్) మోపిదేవి రామ్‌దేవ్, ప్రజాసంఘాల ఐక్యవేదిక తరపున రావూరి శివకృష్ణ పాల్గొంటారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి



తెనాలిఅర్బన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆక్రమణలు ఎక్కువయ్యాయని, వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు పట్టణవాసులు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ బండి శేషన్న ప్రజల నుంచి వినతిపత్రాలు సేకరించారు. రోడ్డుపై గుంతలు ఉండటం వలన వర్షపునీరు నిలిచి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని మరొకరు కోరారు. వీటన్నింటిని పరిష్కరించే విధంగా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

పట్నంబజారు: మహిళ మెడలో నుండి చైన్ లాక్కుని పరారైన సంఘటనపై కేసు నమోదయింది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఐపీడీ కాలనీలో నివాసం ఉండే బొమ్మారెడ్డి పద్మావతి సోమవారం మధ్యాహ్నం ఇంటి నుండి బయటకు వస్తున్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగుడు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని నల్లపూసలు, నానతాడు లాక్కుని పరారీ అయ్యాడు. ఈ క్రమంలో ఆమె గొలుసు గట్టిగా పట్టుకోవడంతో కొద్దిమేరకు ఆమె చేతిలోనే నిలిచిపోయింది. రూపాయలు రెండు లక్షల విలువచేసే 30 గ్రాములు పైన బంగారం చోరీకి గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నంబూరులో జనావాసాల మధ్య బ్రాందీషాపు

పెదకాకాని: నంబూరు గ్రామంలో జనావాసాల మధ్య బ్రాందీషాపు ఏర్పాటు చేయడం పట్ల స్థానికుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామంలో ఈనెల 16వ తేదీన ఒక బ్రాందీషాపు, నంబూరు శివార్లలోని కంతేరు అడ్డరోడ్డు వద్ద ఒక బ్రాందీషాపు ప్రారంభించారు. అదే గ్రామంలో సోమవారం సాయంత్రం మరొక బ్రాందీషాపు ప్రారంభించారు. పెదకాకాని మండలానికి నాలుగు బ్రాందీషాపులు మంజూరు కాగా వాటిలో మూడు షాపులు నంబూరు ఏరియాలోనే ఏర్పాటు చేయడం జరిగింది. నూతనంగా ప్రారంభించిన షాపుకు 20 మీటర్ల దూరంలో నంబూరు 3, 4 సచివాలయాలు ఉండటంతో పాటు 50 మీటర్ల దూరంగా శ్రీగంగానమ్మ తల్లి ఆలయం ఉంది. దీంతో రాత్రి 9 గంటలకు స్థానిక మహిళలు అక్కడికి చేరుకుని నిత్యం మహిళలు, పిల్లలు తిరిగే ప్రదేశంలో బ్రాందీషాపు ఏర్పాటు చేయడంపై అడ్డుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఈ రోజు కొనసాగించాలని, మంగళవారం ఎక్సైజ్‌శాఖ అధికారుల సమక్షంలో సమస్య పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చారు. సంబంధిత అధికారులు స్పందించి గంగానమ్మ అమ్మవారి ఆలయం, సచివాలయం మధ్యన ఉన్న షాపును తొలగించి వేరొక ప్రాంతానికి మార్చాలని స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. షాపును ఇళ్ళ మధ్య నుంచి తొలగించే వరకూ ఆందోళనలు ఆపేదిలేదని మహిళలు పేర్కొన్నారు. వివాదం జరుగుతున్న ప్రాంతానికి పలువురు గ్రామ ప్రజలు, యువకులు చేరుకుని ఇళ్ళ మధ్యలో అమ్మవారి ఆలయం దగ్గర బ్రాందీషాపు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బాబు పేరు చెప్పి.. వృద్ధురాలి వద్ద లక్ష టోకరా

లక్ష్మీపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు దసరా కానుక మంజూరు కావాలంటే పసుపు రంగు చీర పైనే రూ.20 వేలు పెట్టి ఫోటో దిగితే కొన్ని గృహోపకరణాలు ఇస్తారని చెప్పి వృద్ధురాలిని నమ్మబలికి ఆమె వద్ద రూ.1 లక్ష తీసుకుని పరారైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పట్టాభిపురం పోలీసుల కథనం ప్రకారం అశోక్‌నగర్ 4/2 అడ్డరోడ్డు ప్రాంతానికి చెందిన చెరుకూరి శివకుమారి అనే 75 సంవత్సరాల వృద్ధురాలు ఇంటికి ఒక వ్యక్తి ద్విచక్రవాహనం పై వచ్చి మీకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దసరా కానుకగా ఫ్రిజ్, టీ.వి, గ్రైండర్ ఇస్తున్నారని నమ్మబలికాడు. అయితే చంద్రబాబు దసరా కానుక రావాలంటే పసుపు రంగు చీరా పై రూ.20 వేలు పెట్టి ఫోటో దిగాలని చెప్పడంతో వృద్ధురాలు నమ్మి ఇంట్లో నుంచి పసుపు రంగు చీరాతో పాటు రూ.1 లక్ష నగదు తీసుకుని బయటకు వచ్చింది. ఇదే అదునుగా భావించి పసుపు రంగు చీరతో పాటు ఎరుపు రంగు చీర కూడా ఉండాలని చెప్పడంతో పసుపు రంగు చీర, రూ.1 లక్ష నగదు ఆ వ్యక్తి చేతిలో పెట్టి మళ్లీ ఇంట్లోకి వెళ్లడంతో వెంటనే సదరు వ్యక్తి పరారయ్యాడు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.